క్లుప్తంగా

వేంకటేశ్వరస్వామి కల్యాణం



వర్ధన్నపేట : పట్టణ కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో అలిమేలు మంగ, పద్మావతి, శ్రీ వేంకటేశ్వరుల కల్యాణాన్ని అర్చకులు శనివారం కనుల పండువగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు 7వ వార్డు కౌన్సిలర్ పాలకుర్తి సుజాత–సారంగపాణి దంపతులు పట్టువస్త్రాలు సమర్పించారు. కార్యక్రమంలో అర్చకులు శేషబట్టు ఫణికుమార్, సంపత్ కుమార్, కిరణ్, పవన్, శ్రీనివాస్, వెంకటరమణ, నాయకులు సమ్మెట శ్రీనివాస్, అల్లమనేని కమలాకర్‌రావు, శ్రీనివాసరావు, బచ్చు గంగాధర్‌రావు, తిరుపతి, సురేశ్ పాల్గొన్నారు.

మద్యం నిల్వలు స్వాధీనం



రాయపర్తి : మండలంలో అక్రమంగా నిల్వ చేసిన మద్యంను టాస్క్‌ఫోర్స్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ వివరాలు వెల్లడించారు. మండలంలోని పెర్కవేడులో బొమ్మెర వీరన్న, కొండూరులో పులి సోమయ్య, గిరగాని వేణు, ప్రతాపని నాగరాజు ఇండ్లపై దాడి చేసి అక్రమంగా నిల్వ చేసిన రూ.89 వేల 870 విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. వీరన్న, సోమయ్య, వేణు, నాగరాజులపై కేసు నమోదు చేశామన్నారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ పోలీసులు సరళ రాజు, నిసార్ పాషా తదితరులు పాల్గొన్నారు.

రూ.14,160 మద్యం..

సంగెం : అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపులపై టాస్క్‌ఫోర్స్ అధికారులు దాడులు చేశారు. ఇద్దరిపై కేసు నమోదు చేసి రూ.14,160 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు. మండలం ముమ్మిడివరం గ్రామానికి చెందిన నీలం వీరస్వామి కిరాణా షాపులో రూ.5,116 విలువైన మద్యం, దుద్ది కుమారస్వామి కిరాణా షాపులో రూ.9,850 విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరిపై కేసులు నమోదు చేసి, తదుపరి చర్యల నిమిత్తం సంగెం పోలీసులకు కేసు అప్పగించినట్లు ఏసీపీ తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓఆర్ఎస్ ప్యాకెట్ల పంపిణీ



చెన్నారావుపేట : మండలంలోని ఎల్లాయగూడెం గ్రామంలో జాతీయ ఉపాధి హామీ పనుల చేస్తున్న కూలీలకు ఫీల్డ్ అసిస్టెంట్ కందికొండ వసంత, ఆశవర్కర్లు ఉమ, మమత శనివారం ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేశారు. అనంతరం వసంత, ఆశవర్కరుడ్లు మాట్లాడారు. ఎండ తీవ్రత నేపథ్యంలో కూలీలు ఓఆర్ఎస్ ప్యాకెట్లను వినియోగించుకోవాలని సూచించారు. తద్వారా వడదెబ్బకు గురికాకుండా కాపాడుకోవచ్చని చెప్పారు.

చలివేంద్రం ప్రారంభం



సంగెం : మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని తహసీల్దార్ జి.రాజ్‌కుమార్ శనివారం ప్రారంభించి మాట్లాడారు. వేసవి నేపథ్యంలో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాన్ని ఏర్పాటు చేయడం అభినందనీయమని తెలిపారు. బాటసారులు, ప్రయాణికులు చలివేంద్రాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రవీందర్, ఆర్ఐ బాలాజీ, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్ర అభివృద్ధి

● తుక్కుగూడకు తరలిన శ్రేణులు



సాక్షి నెట్‌వర్క్ : కాంగ్రెస్ పార్టీతోనే రాష్ట్ర అభివృద్ధి జరుగుతుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు కర్నాటి పార్వతమ్మ, తొర్రూరు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు జాటోతు హామ్యానాయక్ తెలిపారు. హైదరాబాద్‌లోని తుక్కుగూడలో తలపెట్టిన బహిరంగ సభకు దుగ్గొండి, రాయపర్తి, సంగెం, చెన్నారావుపేట, పర్వతగిరి మండలాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా దుగ్గొండి, రాయపర్తి మండల కేంద్రాల్లో ర్యాలీలను పార్వతమ్మ, హామ్యానాయక్ ప్రారంభించి మాట్లాడారు. కాంగ్రెస్ రాష్ట్రంలో అధికారం చేపట్టిన వెంటనే ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చిన అన్ని హామీల అమలుకు క్రియాశీలకంగా చర్యలు చేపట్టిందని తెలిపారు. పార్టీకి వస్తున్న ఆదరణ నేపథ్యంలో అధిష్టానం ఉత్సాహంగా కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు.

బీఆర్ఎస్ పాలనలోనే రైతు సంక్షేమం



నర్సంపేట : దీక్షా దివస్‌లో మాట్లాడుతున్న సుదర్శన్‌రెడ్డి



వర్ధన్నపేట : మాట్లాడుతున్న వినయ్‌భాస్కర్

● దీక్షా దివస్‌లో మాజీ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నర్సంపేట : బీఆర్ఎస్ హయాంలోనే రైతు సంక్షేమం పరిఢవిల్లిందని స్థానిక మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి మాలోత్ కవిత తెలిపారు. పట్టణంలోని సిటిజన్ క్లబ్ ఆవరణలో శనివారం నిర్వహించిన రైతు దీక్షా దివస్ కార్యక్రమంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం బోగస్ హామీలతో రైతులను మోసం చేసిందన్నారు. కాంగ్రెస్ పార్టీ వరి, మొక్కజొన్న పంటలకు బోనస్ ఇస్తామని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపర్చినా తదనంతరం విస్మరించిందని తెలిపారు. రైతులు పంటలు వేయడానికి సైతం వెనుకంజ వేస్తున్నారని ఆందోళన వెలిబుచ్చారు. మాజీ సీఎం కేసీఆర్ చొరవతో రామప్ప–పాకాల, రంగాయ చెరువు ప్రాజెక్టుల ద్వారా గతంలో ఉగాది నాటికి నియోజకవర్గంలో 292 చెరువులకు మత్తడి పోయించినట్లు గుర్తు చేశారు. ప్రస్తుతం ఒక్క చెరువు కూడా మత్తడి పోస్తుందా? అన్న విషయాన్ని రైతులు గమనించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, ఓడీసీఎంఎస్ చైర్మన్ రామస్వామి నాయక్, జెడ్పీ ఫ్లోర్‌లీడర్ పెద్ది స్వప్న, మున్సిపల్ వైస్ చైర్మన్ మునిగాల వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వంద రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలం

వర్ధన్నపేట : అధికారంలోకి వచ్చిన తర్వాత తొలి వంద రోజుల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని మాజీ ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్‌భాస్కర్ తెలిపారు. నియోజకవర్గ కేంద్రంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన రైతు దీక్షా దివస్ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తొమ్మిదిన్నరేళ్ల బీఆర్ఎస్ పాలనలో రైతులను అన్ని విధాలుగా ఆదుకున్నట్లు తెలిపారు. గత పాలకులు వ్యవసాయం దండగ అని చెప్పి పారిశ్రామిక రంగానికి పెద్దపీట వేయగా సీఎం కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయాన్ని పండగలా చేసి నిరూపించిందని చెప్పారు. అనేక ప్రాజెక్టుల నిర్మాణం, రైతులకు నాణ్యమైన ఉచిత విద్యుత్, ఎరువులు, విత్తనాల పంపిణీ, తదితర అనేక రైతు సంక్షేమ కార్యక్రమాలు చేపట్టిన ఘనత బీఆర్ఎస్ సొంతమన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చిందని ధ్వజమెత్తారు. పదేళ్లపాటు పదవులు అనుభవించిన కడియం శ్రీహరి, అరూరి రమేశ్‌లు బీఆర్ఎస్‌కు నమ్మకద్రోహం చేశారన్నారు. ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీ నుంచి గెలవాలని కడియం శ్రీహరికి సవాల్ విసిరారు. కార్యక్రమంలో కుడా మాజీ చైర్మన్లు మర్రి యాదవరెడ్డి, సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, మాజీ జిల్లా రైతుబంధు అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్, జెడ్పీటీసీ మార్గం భిక్షపతి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తూళ్ల కుమారస్వామి, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్ల బలోపేతమే లక్ష్యం



మాట్లాడుతున్న ఎంపీడీఓ గోవిందరాజులు

చెన్నారావుపేట : ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీలు ఏర్పాటు చేసిందని ఎంపీడీఓ గోవిందరాజులు, ఎంఈఓ రత్నమాల, డీఈ రాజశేఖర్ తెలిపారు. మండల కేంద్రంలోని ఆశాజ్యోతి మండల సమాఖ్య కార్యాలయంలో గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ, విద్యాశాఖ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన వర్క్‌షాప్‌లో వారు మాట్లాడారు. మండలంలో 52 కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. అన్ని పాఠశాలలకు బ్యాంకు ఖాతాలు తెరిపిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల ప్రాధాన్యత మేరకు కమిటీ ఆధ్వర్యంలో అవసరమైన పనులను గుర్తించి ఫొటోలు పంపించాలని సూచించారు. కేటాయించిన నిధులతో అవసరమైన సదుపాయాలు కల్పించనున్నట్లు వివరించారు. విద్యార్థుల ఉన్నతి, పాఠశాలల అభివృద్ధి కోసమే ప్రభుత్వ నిధులను ఖర్చు చేయాలని స్పష్టం చేశారు. ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థుల తల్లిదండ్రుల సహకారంతో పాఠశాలలు అభివృద్ధి చెందుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి అందరూ సమన్వయంతో పని చేయాలని ఆకాంక్షించారు. సమావేశంలో జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ దయాకర్, ఏపీఓ ఈశ్వర్, మండల నోడల్ ఆఫీసర్ సరిత, ఏఈ నరేశ్, ఎస్‌ఓ జ్యోతి, సీఆర్పీలు సంపత్, స్వామి, శిల్ప, హేమలత తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



వర్ధన్నపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్



చెన్నారావుపేట : కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈఓ రవి

వర్ధన్నపేట : ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర లభిస్తుందని తహసీల్దార్ విజయసాగర్, మున్సిపల్ కమిషనర్ జోనా తెలిపారు. పట్టణంలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాన్ని శనివారం వారు ప్రారంభించి మాట్లాడారు. రైతులను దళారుల బారి నుంచి కాపాడేలా, సరైన ధర కల్పించేలా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తోందని చెప్పారు. తాలు లేకుండా ధాన్యాన్ని తీసుకొచ్చి విక్రయించాలని రైతులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలను మండలంలోని రైతులు వినియోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో మహిళ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రైతులు వినియోగించుకోవాలి

చెన్నారావుపేట : సహకార సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు వినియోగించుకోవాలని సీఈఓ చిట్టి రవి, సొసైటీ చైర్మన్ ముద్దసాని సత్యనారాయణ కోరారు. మండలంలోని చెన్నారావుపేట, పాపయ్యపేట, ఎల్లాయగూడెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను వారు ప్రారంభించి మాట్లాడారు. ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2203, కామన్ రకానికి రూ.2183 ధర లభిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో డైరెక్టర్ జంగిలి బాబు, మజ్జిగ రాంబాబు, బషీర్, బానోతు పూల్ శంకర్, వెంకటేశ్వర్లు, మహేందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మొరం తవ్వకాలపై కఠిన చర్యలు

● జేసీబీ యజమానులకు ఎస్సై కౌన్సెలింగ్

సాక్షి ఎఫెక్ట్..



కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై అరుణ్‌కుమార్

చెన్నారావుపేట : ప్రభుత్వ అనుమతి లేకుండా మొరం తవ్వకాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఎస్సై గూడ అరుణ్‌కుమార్ తెలిపారు. మండలంలో జోరుగా మొరం దందా సాగుతుండడాన్ని 'మొరం దందా.. చర్యలు శూన్యం' శీర్షికతో శనివారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఎస్సై అరుణ్‌కుమార్ స్పందించారు. మండలంలోని జేసీబీ యజమానులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ చేశారు. ప్రభుత్వ అనుమతితో మాత్రమే తవ్వకాలు చేపట్టాలన్నారు. ప్రభుత్వ నిబంధనలకు వ్యతిరేకంగా తవ్వకాలు, విక్రయాలు చేపడితే జేసీబీలను సీజ్ చేసి యాజమానులపైనా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండలంలో మట్టి అక్రమ రవాణాను సహించేది లేదని తేటతెల్లం చేశారు.

తప్పిపోయిన వృద్ధురాలి అప్పగింత

వర్ధన్నపేట : తప్పిపోయిన వృద్ధురాలిని కుటుంబ సభ్యులకు పోలీసులు అప్పగించిన ఘటన పట్టణంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. పట్టణానికి చెందిన కొండేటి వరమ్మ ఉదయం కనిపించకుండా పోయింది. ఆమె కుటుంబ సభ్యుడు సాయికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు వృద్ధురాలి కోసం వెతికారు. ఓ డ్రెయినేజీ కాల్వలో నిస్సహాయ స్థితిలో పడి ఉండగా గుర్తించి వెంటనే ఆమె కుటుంబీకులకు అప్పగించారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే ఉత్తమ బోధన



ప్రచారం చేస్తున్న ఉపాధ్యాయులు

నల్లబెల్లి : ప్రభుత్వ స్కూళ్లలోనే ఉత్తమ విద్యాబోధన లభిస్తుందని మండలంలోని నారక్కపేటలోని ప్రభుత్వ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు సుధాకర్‌రావు స్పష్టం చేశారు. ఆయన ఆధ్వర్యంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామాల్లో తిరుగుతూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలలోనే చేర్పాలంటూ శనివారం ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో లభిస్తున్న కంప్యూటర్ విద్య, వేసవి శిక్షణ తరగతులు, మధ్యాహ్న భోజనం, దుస్తులు, పుస్తకాల పంపిణీ, తదితరాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సుధాకర్‌రావు మాట్లాడారు. తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పి ఉచితంగా విద్యను పొందేలా చూడాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులే ఉత్తమ ఫలితాలు సాధిస్తూ దేశం, రాష్ట్రం గర్వించే స్థాయికి ఎదిగినట్లు ఉదహరించారు. ప్రభుత్వ పాఠశాలలో ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగించుకోవాలని కోరారు. ప్రభుత్వ, విద్యాశాఖ ఉన్నతాధికారుల ఆదేశాలు లేనప్పటికీ హెచ్ఎం, ఉపాధ్యాయులు సమిష్టిగా ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రచారం చేస్తుండడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

ఘనంగా బీజేపీ ఆవిర్భావ వేడుకలు



నర్సంపేట:జెండా ఆవిష్కరిస్తున్న రాణాప్రతాప్‌రెడ్డి



వర్ధన్నపేట : జెండాను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్



రాయపర్తి : జెండా ఆవిష్కరిస్తున్న నాయకులు



ఖానాపురం : మాట్లాడుతున్న నాయకులు

నర్సంపేట : పట్టణంలో బీజేపీ ఆవిర్భావ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. 168వ బూత్ కమిటీ ఆధ్వర్యంలో నియోజకవర్గ నాయకుడు డాక్టర్ గోగుల రాణాప్రతాప్‌రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం బూత్ స్వశక్తీకరణ్ కార్యక్రమంలో భాగంగా టిఫిన్ బైటక్ కార్యక్రమం నిర్వహించగా రాణాప్రతాప్‌రెడ్డి మాట్లాడారు. అన్ని బూత్‌ల్లోనూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో పార్టీ అభ్యర్థికి 51 శాతం ఓట్లు పోలయ్యేలా కమిటీ అధ్యక్షుడు బాధ్యతగా పని చేయాలని చెప్పారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు శీలం రాంబాబు, కౌన్సిలర్లు మినుముల రాజు, గోల్యానాయక్, వీరన్న, ప్రధాన కార్యదర్శులు కొంపెల్లి రాజు, గూడూరు సందీప్, తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి : మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో మండల అధ్యక్షుడు జాటోతు శ్రీనివాస్ నాయక్ జెండా ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వస్తుందని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు కుడికాల శ్రీధర్, గిరిజన మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వినోద్‌కుమార్, మాజీ మండల అధ్యక్షుడు కుమార్, ప్రధాన కార్యదర్శి దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఖానాపురం : మండలంలోని పలు గ్రామాల్లో బీజేపీ జెండాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ మాట్లాడారు. అనంతరం టిఫిన్ బైటక్ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో మండల ప్రధాన కార్యదర్శి జల్లి మధు, నాయకులు పాపయ్య, కుమారస్వామి, ముఖేశ్, శ్యామ్, హరి, లక్ష్మణ్, కల్యాణి, లక్ష్మీనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

రాయపర్తి : మండల కేంద్రంలో బీజేపీ జెండాను ఆ పార్టీ పార్లమెంట్ ఎన్నికల మండల ఇన్‌చార్జ్ నూనె అనిల్, యువమోర్చా పాలకుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జ్ ఎనగందుల శ్రావణ్‌కుమార్ ఆవిష్కరించి మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు రాపాక ప్రశాంత్, గోరంట్ల ప్రభాకర్, గారె అశోక్, పెండ్యాల గణేశ్, మంచాల సుమన్, బండారి దినేశ్, రాకేశ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రీయ కళామంచ్ పోస్టర్ ఆవిష్కరణ



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న దేవేందర్, నాయకులు

నర్సంపేట రూరల్ : ఏబీవీపీ ఆధ్వర్యంలో తలపెట్టిన రాష్ట్రీయ కళామంచ్ సింగిడి–2024 రాష్ట్రస్థాయి సాంస్కృతిక పోటీల వాల్‌పోస్టర్‌ను జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ శనివారం ఆవిష్కరించారు. అనంతరం దేవేందర్ మాట్లాడారు. హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈనెల 20, 21 తేదీల్లో పోటీలు ఉంటాయని చెప్పారు. సంఘం ఆందోళనలకే కాకుండా విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించేందుకు పలు కార్యక్రమాలు చేపడుతోందని చెప్పారు. విద్యార్థులు పోటీల్లో పాల్గొని నైపుణ్యాలను ప్రదర్శించాలని ఆకాంక్షించారు. శాస్త్రీయ, జానపద నృత్యాలతోపాటు ఫొటోగ్రఫీ, చిత్రలేఖనం, యువకవి సమ్మేళనం, శాస్త్రీయ గీతాలు, జానపద గీతాలు, రంగోలి, ఏకపాత్రాభినయం, సాంప్రదాయ వస్త్రాలంకరణ, లఘు చిత్రం, డప్పు, శిల్పకళ, తదితర అంశాలపై ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. కార్యక్రమంలో నాయకులు రాజేశ్, విఘ్నేశ్, శ్రీకాంత్, అరవింద్, రాకేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరం



గీసుకొండ : మండలంలోని ధర్మారం గ్రామంలోని జెడ్పీ హైస్కూల్‌లో ప్రముఖ ఫిజియోథెరపిస్టు డాక్టర్ రణధీర్, పూర్వవిద్యార్థి నితిన్ ఆధ్వర్యంలో వరంగల్ నగరంలోని కాశిబుగ్గకు చెందిన వేద్ పిల్లల క్లినిక్ నిర్వాహకులు శనివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లల వైద్యనిపుణుడు డాక్టర్ కొట్టె చిరంజీవి, ఫిజియోథెరపిస్టులు డాక్టర్ అనూశ, డాక్టర్ గణేశ్, నవీన్, వేణు విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఆరోగ్య పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

'రేవూరి ఆరోపణలు సరికాదు'

సంగెం : ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణపై పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి చేసిన ఆరోపణలు సరికాదని రాష్ట్ర ఉపాధ్యక్షుడు చాతల్ల రమేశ్, జిల్లా అధ్యక్షుడు కట్ల రాజశేఖర్ అన్నారు. మాదిగ జాతి నేతలను కించపర్చేలా వ్యాఖ్యలు చేయొద్దని హితవు పలికారు. ఎమ్మెల్యే ప్రకాశ్‌రెడ్డి వెంటనే ఆరోపణలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు మంద రాజు, తదితరులు పాల్గొన్నారు.

'స్కూల్‌పై చర్యలు తీసుకోవాలి'



సిబ్బందిని నిలదీస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

నర్సంపేట : ప్రభుత్వ నిబంధనలు ఉల్లంఘిస్తున్న పట్టణంలోని శ్రీచైతన్య ప్రైవేటు స్కూల్ యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బొట్ల నరేశ్, ఏఐఎఫ్‌డీఎస్ డివిజన్ కార్యదర్శి మార్త నాగరాజు, ఏఐఎస్ఎఫ్ జిల్లా కమిటీ సభ్యుడు ప్రమోద్, ఏఐఎస్‌బీ జిల్లా కమిటీ సభ్యుడు సతీశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆ స్కూల్ సిబ్బంది పుస్తకాలను విక్రయించేందుకు తీసుకురాగా విద్యార్థి సంఘాల నాయకులు శనివారం అడ్డుకున్నారు. విద్యాసంవత్సరం మొదలవకుండానే పుస్తకాల విక్రయానికి తెగబడుతున్నారని మండిపడ్డారు. సిబ్బందిని నిలదీశారు. పట్టణంలోని అద్దె భవనంలో సేల్‌టాక్స్ చెల్లించకుండా, పర్మిషన్, ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండానే పాఠ్యపుస్తకాలు తీసుకొస్తున్నారని చెప్పారు. డీఈఓకు సమాచారం ఇచ్చేందుకు ఫోన్ చేసినా స్పందించడం లేదన్నారు. శ్రీచైతన్య స్కూల్ యాజమాన్యంపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు.

'శ్రీక్రోధ' సంవత్సర పంచాంగాల పంపిణీ



పంచాంగాలను అందజేస్తున్న రంగనాథస్వామి

గీసుకొండ : మండలంలోని కొమ్మాల లక్ష్మీనృసింహ స్వామి ఆలయంలో వికాస తరంగిణి ఆధ్వర్యంలో టీటీడీ ధర్మ ప్రచారక్ రంగనాథస్వామి శనివారం శ్రీక్రోధ నామ సంవత్సర పంచాంగాలను పంపిణీ చేశారు. తొలుత శ్రీవిష్ణు నామ సహస్ర పారాయణం చేపట్టారు. కార్యక్రమంలో వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు, అర్చకులు రామాచార్యులు, సభ్యులు రేణుక, శ్రీలత, లక్ష్మి, పద్మ, అరుణ, త్రివేణి, శ్రీనివాస్, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మార్కండేయ కాలనీకి బెంచీల వితరణ



బెంచీ ఏర్పాటు చేస్తున్న ప్రశాంత్, వీరన్న

నర్సంపేట : పట్టణంలోని మార్కండేయ కాలనీకి స్థానికులు సేద తీరడానికి చింతం పరమేశ్వర్ జ్ఞాపకార్థం చింతం ప్రశాంత్, వీరన్న శనివారం బెంచీలను వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రశాంత్ మాట్లాడారు. బియాస్ నదిలో గల్లంతై మృతి చెందిన పరమేశ్వర్ జ్ఞాపకార్థం బెంచీలు అందించినట్లు తెలిపారు. అంబేడ్కర్ సెంటర్‌లో గత తొమ్మిదేళ్లుగా బాటసారుల దాహార్తి తీర్చేలా చలివేంద్రం ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కాలనీ కమిటీ అధ్యక్షుడు పెండెం శివానంద్, కార్యదర్శి బాల్నె సుభాష్, ఉపాధ్యక్షుడు ఆడెపు కొమ్మాలు, ముఖ్య సలహాదారులు కూచన రవీందర్, జడల శ్రీనివాస్, గొల్లపల్లి మల్లేశం, గాజుల రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే ప్రజాస్వామ్య పరిరక్షణ

● జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వరంగల్ : ఓటుతోనే ప్రజాస్వామ్యం పరిరక్షించబడుతుందని జిల్లా స్వీప్ నోడల్ అధికారి భాగ్యలక్ష్మి అన్నారు. వరంగల్ లోక్‌సభ నియోజకవర్గం పరిధిలోని వరంగల్ తూర్పునకు సంబంధించి శనివారం సుందరయ్యనగర్‌లోని ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడారు. ప్రతి ఐదేళ్లకు ఒకసారి ఓటుతో ఉత్తమ నాయకులను ఎన్నుకునే అవకాశాన్ని సీనియర్ సిటిజన్లు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఎలాంటి ప్రలోభాలకు తావివ్వకుండా ఓటు వేయాలని అన్నారు. అనంతరం సీనియర్ సిటిజన్లతో ప్రతిజ్ఞ చేయించారు. సదస్సులో వరంగల్ తూర్పు నియోజకవర్గ స్వీప్ నోడల్ అధికారి కోలా రాజేష్‌కుమార్, టీఎంసీ రమేష్, సీనియర్ సిటిజన్లు డాక్టర్ రాజేంద్రప్రసాద్, మల్లారెడ్డి, సంజీవరావు పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

రాయపర్తి : మండలంలోని కొలన్‌పల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులను డబ్బులు డిమాండ్ చేసి బెదిరింపులకు పాల్పడ్డ పీడీఎఫ్ పేపర్ విలేకరులు ఇబ్రహీం, బొమ్మిదేని కోటేశ్వర్‌లను శనివారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై వడ్డే సందీప్‌కుమార్ తెలిపారు.

'అంగడి వేలం ఖరారు చేయండి'

గీసుకొండ : మండలంలోని కొమ్మాల అంగడిలో కొమ్మాల గ్రామపంచాయతీ వాటాగా నిర్వహించే అంగడి వేలంను ఖరారు చేయాలని బీఆర్ఎస్ నాయకుడు గడ్డమీది కుమారస్వామి కోరారు. కొమ్మాలలో ఆయన మాట్లాడారు. అంగడికి మూడు సార్లు వేలం నిర్వహించగా తాను రూ.35.10 లక్షలకు పాడిన వేలం అధికమని చెప్పారు. గతంలో 2000–01 సంవత్సరంలో డిమాండ్ రూ.72 లక్షలు ఉండగా రూ.38 లక్షలకే ఖరారు చేసిన నేపథ్యంలో అదే తరహాలో తన టెండర్‌ను ఖరారు చేయాలని చెప్పారు.